## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 20-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- కేంద్ర సంక్షేమ పథకాలతో దేశ అభివృద్ధి ప్రస్థానంలో గిరిజన సమాజం కీలక భాగస్వామిగా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.
- ప్రపంచ వ్యాప్తంగా రేపు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు.
- గత 12 ఏళ్లలో దేశం "అభివృద్ధి, జాతీయ భద్రత, అంతర్జాతీయ గుర్తింపు" రంగాల్లో విశేష పురోగతి సాధించిందని కేంద్రమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడు వన్డేల క్రికెట్ సిరీస్‌ను భారత్ 3-0తో కైవసం చేసుకుంది.

==========================

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో దేశ అభివృద్ధి ప్రస్థానంలో గిరిజన సమాజం కీలక భాగస్వామిగా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఒడిశాలోని మోహన్ చరణ్ మాఝీ ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మయూర్‌భంజ్ జిల్లా రైరంగ్‌పూర్‌లో ఈరోజు నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ రాష్ట్రంలో 47 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ... దశాబ్దాలుగా గిరిజన జనాభా ఎదుర్కొంటున్న వెనుకబాటుతనం ముగిసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్య, వైద్యం, జీవనోపాధి, సామాజిక పురోభివృద్ధి రంగాలలో గిరిజనులకు సరికొత్త అవకాశాలు లభిస్తున్నాయని ప్రధానిమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఈ సభలో పాల్గొన్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మయూర్‌భంజ్ జిల్లాలోని రాష్ట్రపతి స్వగ్రామమైన `పహాడ్‌పూర్`ను సందర్శించడం తనకు దక్కిన గొప్ప భాగ్యంగా ప్రధాని అభివర్ణించారు. ఈ నేపథ్యంలో పహాడ్‌పూర్‌ను త్వరలోనే పూర్తిస్థాయి పునరుత్పాదక ఇంధన వనరులతో నడిచే 'సూర్య గ్రామం'గా తీర్చిదిద్దుతామని నరేంద్ర మోదీ ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యంత వేగంగా పని చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సువేందు అధికారితో కలిసి పాల్గొన్న ప్రధాని.. రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బెంగాల్‌లో పలు కీలక రంగాలకు చెందిన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రైల్వే, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మత్స్య రంగం, పశుసంవర్ధక శాఖలకు చెందిన వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టులను జాతికి అంకితం చేయడంతో పాటు కొత్త పనులకు పునాదిరాళ్లు వేశారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచడమే కాకుండా.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని ఈ సందర్భంగా ప్రధాని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

`ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి` (PM-KISAN) పథకం కింద 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు నేరుగా రైతుల ఖాతాల్లోకి విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో మొత్తం 18 వేల 880 కోట్ల రూపాయలకు పైగా నిధులను లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. దేశవ్యాప్తంగా ఈ రోజును 'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్'గా రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా దాదాపు 9 కోట్ల 44 లక్షల మంది రైతులు లబ్ధి పొందగా.. వారిలో 2 కోట్ల 18 లక్షల మంది మహిళా రైతులు ఉండటం విశేషం.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆధునికతను స్వీకరిస్తూనే.. సంస్కృతిని కాపాడుకునే సమాజమే సంపన్న సమాజమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఒడిశాలోని మోహన్ చరణ్ మాఝీ ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మయూర్‌భంజ్ జిల్లా రైరంగ్‌పుర్‌లో ఈరోజు నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్రపతి మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ సమర్థవంతమైన నాయకత్వం వల్లే ప్రపంచ వేదికలపై భారతదేశ ప్రతిష్ఠ పెరిగిందన్నారు. దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నరేంద్ర మోదీ జాతీయ ప్రయోజనాల కోసం అనేక విప్లవాత్మక చర్యలు తీసుకున్నారని రాష్ట్రపతి కొనియాడారు. 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత భారత్'గా మార్చాలనే సంకల్పంలో నరేంద్ర మోదీ దేశాన్ని మరింత ముందుకు నడిపించాలని ఆమె ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా రేపు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అన్ని వయసుల వారికి యోగా ఎంతో ఆవశ్యకమనే సందేశాన్ని చాటుతూ.. ఈ ఏడాది 'ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి యోగా' అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. భారతదేశ సంస్కృతి, యోగా సంప్రదాయాల సమ్మేళనంగా.. దేశంలోని 100 ప్రముఖ చారిత్రక, పర్యాటక ప్రాంతాల్లో కేంద్ర సాంస్కృతిక శాఖ ప్రత్యేక యోగా ప్రదర్శనలను ఏర్పాటు చేస్తోంది. జాతీయ స్థాయి ప్రధాన వేడుక రేపు కోల్‌కతాలోని చారిత్రాత్మక రెడ్ రోడ్ వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరగనుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోం మంత్రి, సహకార శాఖ మంత్రి అమిత్ షా ఈ రోజు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో 1,445 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన శ్రీ అంబాబాయి ఆలయ అభివృద్ధి ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన

బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ.. ఆలయ చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఏమాత్రం దెబ్బతీయకుండా.. ఈ ప్రాజెక్టు ద్వారా ఆలయాన్ని ఆధునిక ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లలో దేశం అభివృద్ధి, సాంస్కృతిక పునరుజ్జీవనం, జాతీయ భద్రత, అంతర్జాతీయ గుర్తింపు రంగాల్లో విశేష పురోగతి సాధించిందని పేర్కొన్నారు. దేశ భద్రత, సరిహద్దుల నిర్వహణపై కేంద్రప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

'కైలాస మానససరోవర యాత్ర-2026' ఈరోజు అధికారికంగా ప్రారంభమైంది. ఈ ఏడాది యాత్రకు సంబంధించి ఎంపికైన భక్తుల మొదటి బృందం.. సిక్కింలోని చారిత్రాత్మక నాథూలా కనుమ (Nathu La Pass) సరిహద్దు దాటి చైనా భూభాగంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా సిక్కిం గవర్నర్ ఓం ప్రకాష్ మాథుర్, ఆ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి షెరింగ్ తెందుప్ భూటియాతో కలిసి యాత్రికుల మొదటి బృందానికి జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. నాథూలా సరిహద్దు దాటిన ఈ బృందంలో మొత్తం 47 మంది ఉన్నారు. యాత్రికులు ఈ నెల 27వ తేదీన అత్యంత పవిత్రమైన 'మానససరోవర పరిక్రమ' (ప్రదక్షిణ) చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన మూడు సరికొత్త యుద్ధనౌకలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు కోల్‌కతా నౌకాశ్రయంలో జాతికి అంకితం చేయనున్నారు. ఐఎన్ఎస్ దునగిరి (INS Dunagiri), ఐఎన్ఎస్ సంశోధక్ (INS Sanshodhak), ఐఎన్ఎస్ అగ్రయ్ (INS Agray) అనే ఈ మూడు నౌకల చేరికతో భారత నావికాదళ అమ్ములపొది మరింత శక్తివంతం కానుంది. భారత నౌకాదళానికి చెందిన `వార్‌షిప్ డిజైన్ బ్యూరో` ఈ నౌకల నమూనాలను రూపొందించగా.. ప్రభుత్వ రంగ సంస్థ `గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్` (GRSE) వీటిని నిర్మించింది. ఈ యుద్ధనౌకల నిర్మాణంలో 75 శాతానికి పైగా స్వదేశీ సాంకేతికతను, వస్తువులను ఉపయోగించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 3-0తో కైవసం చేసుకుంది. చెన్నైలోని ఎం.ఎ. చిదంబరం స్టేడియం వేదికగా అఫ్గానిస్థాన్ తో ఈరోజు జగిరిన మూడో వన్డే క్రికెట్ మ్యాచ్‌లో 219 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. భారత బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ 110, రోహిత్ శర్మ 79 పరుగులు చేశారు. తొలిత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ 218 పరుగులకు ఆలౌట్ అయ్యింది. భారత బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్లు తీసుకున్నాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వినియోగంలో ఉన్న 16 రకాల `ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్` (FDC) ఔషధాల ఉత్పత్తి, విక్రయాలు, పంపిణీపై తక్షణమే పూర్తిస్థాయి నిషేధం విధిస్తూ.. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ గెజిట్ నోటిఫికేషన్ ను ఈరోజు విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు `డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్` (DTAB) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఈ కాంబినేషన్ మందులపై సమగ్ర సమీక్ష జరిపింది. ఈ మందుల కలయిక వల్ల రోగులకు ఎలాంటి అదనపు వైద్య ప్రయోజనం లేదని, శాస్త్రీయ ఆధారాలు లేని ఇటువంటి `అహేతుక` ఔషధ మిశ్రమాలు ప్రజారోగ్యానికి హానికరమని తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =